క్లుప్తంగా

మన్ కీ బాత్ వీక్షణ

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో యువకులు ఆదివారం మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లాశ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించే మన్‌కీబాత్(మనసులో మాట) కార్యక్రమాన్ని చూశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో మనదేశ క్రీడాకారులు రాణించాలని ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్షించారని తెలిపారు. కార్యక్రమంలో దాసరి సతీష్, తిబిరిశెట్టి శ్రీను, చిత్రా లోవరాజు, మదినే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోవులను సంరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం

ఏలేశ్వరం: గోమాతలను సంరక్షించుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ధర్మప్రచారక్ తోట జగన్నాథం కోరారు. మండలంలోని యర్రవరంలో ఆదివారం సరస్వతీ శిశుమందిర్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవుపాలు ఎంతో ఆరోగ్యకరమన్నారు. భారత సంస్కృతి, సంప్రదాయాల్లో గోవులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. గోవులను సంరక్షించుకోవల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు, కంబాల నారాయణరావు, కొప్పన కోటేశ్వరరావు, కురాకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక వాయిదా

ప్రత్తిపాడు: స్థానిక లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలులో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను వాయిదా వేసినట్టు తహసీల్దార్ ఎస్.నరసింహారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆధ్వర్యాన నిర్వహించ తలపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేశామన్నారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు రౌతులపూడి పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం రాజవరం గ్రామానికి చెందిన కొల్లు నానాజీ (36) రౌతులపూడి మండలంలోని లచ్చిరెడ్డిపాలేనికి చెందిన ఓ మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా గత కొంతకాలంగా కుటుంబం, ఆరోగ్య పరంగా తలెత్తిన సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఆదివారం ఉదయం బీబీపట్నం శివారున పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారాన్ని బాధ్యతగా తీసుకోవాలి



నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా బాధ్యత తీసుకోవాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు అన్నారు. తుని మండలం తేటగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ భవిష్యత్ ప్రణాళిక, ప్రధాన సమస్యల పరిష్కరించడంలో ప్రాధాన్యతలపై మూడు మండలాల నాయకులతో చర్చించారు. ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తే అందుకు అవసరమైన నిధులు కేటాయింపు జరుగుతుందన్నారు. నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన సాగుకు ఊతం

- పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం అనుసంధానం
- కత్తిపూడి, ప్రత్తిపాడు క్లస్టర్లలో 2,100 ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.2,02,659 వరకూ రాయితీ
- దరఖాస్తుకు నెలాఖరు వరకూ గడువు



కొలిమేరులో సాగు చేస్తున్న కొబ్బరి మొక్కతోట

తుని రూరల్: పండ్ల తోటల సాగుకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఊతం ఇస్తోంది. దేశ విదేశాల్లో పెరుగుతున్న డిమాండ్‌కు అనువుగా పండ్ల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో మామిడి, జీడి మామిడి, తీపి నారింజ, కొబ్బరి, చింత, తీపి యాపిల్, సపోట, నిమ్మ వంటి ఉద్యాన పంటలు విస్తరించేందుకు ఎంజీఎన్ ఆర్ఈజీఎస్‌ను అనుసంధానం చేశారు. 2024–25 సంవత్సరంలో కాకినాడ జిల్లాలో 3,200 ఎకరాల్లో పండ్ల తోటలను విస్తరించనుండగా కత్తిపూడి, ప్రత్తిపాడు క్లస్టర్లలో 2,100 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కత్తిపూడి క్లస్టర్ పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాలు ఉన్నాయి. ప్రత్తిపాడు క్లస్టర్‌లో గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలు ఉన్నాయి.

రైతులకు రాయితీలు

తొండంగి మండలంలో వంద ఎకరాల్లో పండ్ల తోటల విస్తరణ లక్ష్యం కాగా మిగిలిన మండలాల్లో రెండు వందల ఎకరాల చొప్పున పండ్ల తోటల సాగును విస్తరించాల్సి ఉంది. పండ్ల తోటలను బట్టి ఎకరా నిర్వహణకు రూ.65,763 నుంచి రూ.2,02,659 వరకు రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ రాయితీ నిధులు లభిస్తాయి. ఇందులో 60 శాతం పని దినాలకు, 40 శాతం మెటీరియల్‌కు కేటాయించారు. మెటీరియల్‌లో మొక్కలు, ఎరువుల కొనుగోలు, నీటి తడులకు నిధులు వినియోగిస్తారు. ఉపాధి పనులు చేసే కూలీలు లేదా లబ్ధిదారుడికి పని దినాలు కల్పన లెక్కిస్తారు. ఒక్కొక్క పని దినానికి రూ.300 చొప్పున లెక్కిస్తారు.

917 ఎకరాల గుర్తింపు

కత్తిపూడి, ప్రత్తిపాడు క్లస్టర్ల పరిధిలో 2100 ఎకరాల్లో పండ్ల తోటలు విస్తరణ లక్ష్యంగా అధికారులు నిర్ధారించారు. ఇప్పటివరకూ 917 ఎకరాలను గుర్తించారు. తుని మండలంలో 63 ఎకరాలు, కోటనందూరులో 31 ఎకరాలు, రౌతులపూడిలో 110 ఎకరాలు, శంఖవరంలో 66 ఎకరాలు, తొండంగిలో 111 ఎకరాలను గుర్తించారు. గండేపల్లిలో 50 ఎకరాలు, జగ్గంపేటలో 115 ఎకరాలు, కిర్లంపూడిలో 218 ఎకరాలు, పెద్దాపురంలో 44 ఎకరాలు, ప్రత్తిపాడు 53 ఎకరాలు, ఏలేశ్వరం 49 ఎకరాలను గుర్తించారు. ఆయా భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగుకు ఉన్నత అధికారులు అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. ఆసక్తిగల రైతులు ఈనెలాఖరుకు దరఖాస్తులు చేసుకుంటే ఆగస్టు 15 నాటికి రాయితీలు మంజూరు చేస్తామని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అధికారులు తెలిపారు.

మూడేళ్ల సాగు నిర్వహణకు ఉపాధి నిధులు కేటాయింపులిలా..

పంట	మొక్కల సంఖ్య	కూలీలకు పని దినాలు	రాయితీ మొత్తం
మామిడి	70	216	రూ.1,06,170
నిమ్మ	110	275	రూ.1,43,011
జీడి మామిడి	70	179	రూ.95,324
తీపి నారింజ	100	251	రూ.1,31,150
కొబ్బరి	60	187	రూ.92,704
చింత	40	129	రూ.65,763
తీపి ఆపిల్	240	385	రూ.2,02,659
సపోటా	60	187	రూ.92,704

అంచనాలు సిద్ధం చేశాం



మండలంలో ఇప్పటికే గుర్తించిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాం. ఇప్పటివరకూ గుర్తించిన భూముల్లో పండ్ల తోటల సాగుకు అవసరమైన అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారుల అనుమతులకు పంపించాం. అనుమతులు రాగానే లబ్ధిదారులకు సమాచారం ఇస్తాం. నిర్దేశించిన విధంగా మొక్కలు నాటాల్సి ఉంటుంది. వర్షాకాలంలో మొక్కలు కొనుగోలు చేసి బిల్లులు అందజేస్తే నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు రాయితీ నిధులు (డబ్బు) జమవుతాయి. ఆసక్తి గల రైతులు ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను సంప్రదించాలి.

– పసుపులేటి నారాయణరావు, ఉపాధి ఏపీఓ, తుని

పిల్లలకు సంస్కారం, విద్యను అందించాలి

గండేపల్లి: తల్లిదండ్రులు పిల్లలకు సంస్కారం, విద్యను అందివ్వాలని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం పేరెంట్స్ డే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్థిపాస్తులు ఇవ్వకపోయిన పర్వాలేదు కాని మంచి విద్యను, సంస్కారాన్ని అందివ్వాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల గౌరవభావం, భక్తిభావం కలిగి ఉండేలా విద్యార్థులకు తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అడ్మిషన్స్ ఎ.రామకృష్ణ, డీన్ వి.సత్యనారాయణ, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శుభాకర్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

గోకవరం: వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని వీరలంకపల్లికి చెందిన పైడిమళ్ల సోమరాజుకు, అల్లాడి నాగేశ్వరరావుకు గత కొంత కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. ఆదివారం ఉదయం సోమరాజు తన పొలంలో పని చేస్తుండగా నాగేశ్వరరావు అతని వద్ద ఉన్న పదునైన వస్తువుతో దాడి చేశాడు. ఈ దాడిలో సోమరాజు వీపుపై బలమైన గాయమైంది. దీనిపై బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాల సంబరం



జె.కొత్తూరులో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో ముత్యాలమ్మతల్లి బోనాల సంబరం ఆదివారం కన్నులపండువగా జరిగింది. గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలు అమ్మవారి బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోకవరం డ్రైవర్స్ కాలనీలో..

గోకవరం: స్థానిక డ్రైవర్స్ కాలనీలో బోనాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వందలాది సంఖ్యలో మహిళలు బోనాలను తలకెత్తుకుని గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానిక కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



గోకవరం డ్రైవర్స్ కాలనీలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

2 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

జగ్గంపేట: స్థానిక కాపు కల్యాణ మండపంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి డీఎస్సీ అభ్యర్థులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. కాపు కల్యాణ మండపంలో ఉచిత కోచింగ్ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ వచ్చే నెల 2వ కోచింగ్‌ను ప్రారంభిస్తారన్నారు. ఇప్పటివరకూ డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం 432 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. కోచింగ్‌కు వచ్చిన వారికి భోజన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



జగ్గంపేటలో డీఎస్సీ ఉచిత కోచింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

నీడ చూపవా సత్యదేవా !

- రత్నగిరిపై పశ్చిమ రాజగోపురం వద్ద గ్రీన్‌షేడ్ నెట్ తొలగింపు
- ఎండ, వానలకు ఇబ్బంది పడుతున్న భక్తులు
- శాశ్వత షెడ్డు నిర్మించాలని మొర



సత్యదేవుని పశ్చిమ రాజగోపురం వద్ద కానరాని గ్రీన్ షేడ్‌నెట్



గతంలో పశ్చిమ రాజగోపురం వద్ద ఉన్న గ్రీన్‌షేడ్ నెట్, దాని దిగువన పందిరి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో చిన్న చిన్న సమస్యలు సైతం నెలల తరబడి పరిష్కారం కావడం లేదు. సమస్య ఉందని అందరికీ తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో అన్నవరంలో వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఇలా వచ్చే భక్తుల్లో సగానికి పైగా పశ్చిమ రాజగోపురం వైపు గల రోడ్డు ద్వారా వస్తారు. తిరిగి అదేమార్గంలో బయటకు వెళతారు. ఈ పశ్చిమ రాజగోపురం ముందు చాలా రోజుల పాటు గ్రీన్ షేడ్ నెట్ ఉండేది. ఇది భక్తులకు ఎండా కాలంలో ఎండ నుంచి రక్షణ కల్పించేది. వర్షాకాలంలో ఈ నెట్‌కు గల సూక్ష్మ రంధ్రాల నుంచి వర్షపు నీరు భక్తులపై పడి ఇబ్బంది పడేవారు. కాగా నెల రోజుల క్రితం ఈదురుగాలులకు పశ్చిమ రాజగోపురం ముందు గల ఈ గ్రీన్ షేడ్ నెట్ చిరిగిపోవడంతో తొలగించారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ గ్రీన్ షేడ్ నెట్ వేయలేదు. అలాగని భక్తులు ఎండకు ఎండకుండా, వానకు తడవకుండా ఏమైనా ఏర్పాట్లు చేశారా ? అంటే అదీ లేదు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

వర్షంతో ఇక్కట్లు

అల్పపీడనం ప్రభావంతో గత 15 రోజులుగా నిత్యం ఏదో సమయంలో వర్షం కురుస్తోంది. ఆ వర్షంలో తడుస్తూ భక్తులు పశ్చిమ రాజగోపురం ద్వారా స్వామివారి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుంటున్నారు. అనంతరం తిరిగి వచ్చే సమయంలో వర్షంలో తడుస్తూ ఇబ్బంది పడుతున్నారు. పశ్చిమ రాజగోపురం పక్కనే వ్రతాల టిక్కెట్ల కౌంటర్ ఉంది. ఆ కౌంటర్‌లో భక్తులు టిక్కెట్లు తీసుకునేందుకు కూడా గోపురం వద్ద షెల్టర్ లేక ఇబ్బంది పడుతున్నారు. దేవస్థానానికి వీఐపీలు వచ్చినా పశ్చిమ రాజగోపురం ద్వారానే స్వామివారి ఆలయానికి వెళతారు. వారు కూడా వర్షంలో తడుస్తూ వెళ్లడమో లేక అధికారులు ఏర్పాటు చేసిన గొడుగుల కింద వెళ్లడమో చేస్తున్నారు. కాగా గతంలో పశ్చిమ రాజగోపురం వద్ద గ్రీన్ షేడ్ నెట్ ఉండేదన్న ఆనవాళ్లకి ఆ నెట్ అమర్చిన ఇనుప గొట్టాలు అక్కడే నెల రోజులుగా దర్శనమిస్తున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు పశ్చిమ రాజగోపురం ద్వారానే సత్యదేవుని దర్శనానికి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. లేకుంటే స్వామివారి రథానికి వేసిన టిన్‌షెల్ షెడ్డు వంటిది వేసినా భక్తులకు ఇబ్బంది ఉండదు. గతంలో గ్రీన్ షేడ్ నెట్ ఎంత ఎత్తులో ఉండేదో అంతే ఎత్తులో షెడ్డు వేస్తే గోపురం కూడా భక్తులందరికీ కనిపించే అవకాశం ఉంది. ఈ మేరకు దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

చారుమజుందార్‌కు ఘన నివాళులు

ఏలేశ్వరం: నక్సల్‌బరీ ఉద్యమ నేత చారుమజుందార్ 52వ సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక వినోద్ మిశ్రా నగర్‌లో సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో చారుమంజుదార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసిన చారుమజుందార్‌ను పోలీసులు లాకప్‌లో అన్యాయంగా అంతమొందించారన్నారు. చారుమజుందార్ ఆశయాలను కొనసాగించడమే తమ ధ్యేయమన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అండతో కొందరు వామపక్షాలపై చేస్తున్న దాడులను ప్రజా ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, కందుల వరలక్ష్మి, సోమాల కుశల, నాగులాపల్లి అర్జునుడు, మసిరపు రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో చారుమజుందార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ప్లాస్టిక్ నిషేధమెక్కడ?

- నగరంలో విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం
- ఎక్కడిక్కడ పేరుకుపోతున్న కవర్లు
- ప్రజల్లో కానరాని అవగాహన
- దుకాణాల్లో తగ్గిన దాడులు
- చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు



రాజేశ్వరినగర్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం ఎదురువీధిలో తాగిపడేసిన ప్లాస్టిక్ గ్లాసులు



పాలిథిన్ కవర్లతో పండ్లు తీసుకొని వెళుతున్న వినియోగదారుడు

బోట్‌క్లబ్: ప్లాస్టిక్ నిషేధం ప్రకటనలకే పరిమితమైంది. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా ప్లాస్టిక్ వినియోగం ఎక్కడికక్కడ యథేచ్ఛగా సాగుతోంది. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు అని తెలిసినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. అధికార యంత్రాంగం నామ మాత్ర తనిఖీలతో సరిపెట్టేస్తోంది. దీంతో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతోంది. కాకినాడ నగరంలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. నగరంలో ఎక్కడ చూసిన పాలిథిన్ కవర్లు దర్శనమిస్తున్నాయి. కూరగాయలు, సరకులు, పండ్లు, ఇతర నిత్యావసర సరకులన్నీ ఈ క్యారీ బ్యాగుల్లోనే తీసుకువెళ్లడం ప్రజలకు అలవాటైపోయింది.

ఎక్కడికక్కడే దర్శనం

కాకినాడ నగరంలో సుమారు ఆరు లక్షలపైగా జనాభా ఉన్నారు. 50 డివిజన్లు ఉన్నాయి. ప్రతి రోజు పారిశుధ్య సిబ్బంది 200 టన్నులకు పైగా చెత్తను సేకరిస్తున్నారు. వీటిలో మూడు నుంచి నాలుగు టన్నుల వరకూ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వస్తున్నాయి. చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లనుంది. నగరంలో ఎక్కడా వీటి వినియోగం ఆగిన దాఖలాలు లేవు. నగరంలో పాలిథిన్ క్యారీ బ్యాగ్‌లు, గ్లాసులు, ప్లేట్లు విక్రయించే ప్లాస్టిక్ దుకాణాలు పెద్ద ఎత్తునే ఉన్నాయి. అధికారులకు చూసీచూడనట్లు వ్యవహరించడంతో యథావిధిగా వ్యాపారాలు సాగించుకుంటున్నారు. కాకినాడ నగరంలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని హడావుడి చేశారు. వ్యాపారులు కూడా వాటిని విక్రయించేందుకు భయపడేవారు. గత కొన్ని రోజులుగా తనిఖీలు చేయకపోవడంతో ప్లాస్టిక్ కవర్లు విచ్చిలవిడిగా దర్శనమిస్తున్నాయి.

పారిశుధ్య సమస్యలు

క్యారీ బ్యాగులను వినియోగించి వాటిని విచక్షణా రహితంగా రోడ్లపై పడవేస్తున్నారు. అవి మురుగు కాలువల్లో పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డు పడుతున్నారు. దీంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారవుతోంది. ప్రజలు పాలిథీన్ కవర్లలో ఆహార పదార్థాలు తీసుకుని తినడం, తరువాత వాటిని రోడ్లపై పడవేస్తుండడంతో మూగజీవాలు వాటిని తిని ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నాయి. మూడు నెలలు క్రితం అధికారులు చేసిన దాడులు కారణంగా నగరంలో ఏ దుకాణానికి వెళ్లిన పాలిథీన్ కవర్లు ఇవ్వడం లేదని, వినియోగదారులు సంచులు తెచ్చుకోవాలని నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసేవారు. దీంతో నగరంలో పాలిథీన్ కవర్ల వినియోగం కాస్త తగ్గింది. అధికారులు ఆకస్మిక తనిఖీ చేయకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా కవర్లు విక్రయిస్తున్నారు.

వాటర్ ప్లాంట్ తనిఖీలు నిల్

కాకినాడ నగరంలో సుమారు 50కి పైగా మినరల్ వాటర్ విక్రయించే ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో చాలా వరకూ నిషేధిత ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ప్రతిరోజు ఆటోల్లో తీసుకెళ్లి వివిధ దుకాణాలు విక్రయిస్తున్నారు. అయినప్పటికీ అధికారులెవ్వరూ వారిపై చర్యలు తీసుకోవడం లేదు.

బ్రాందీషాపులు సమీపంలో..

బ్రాందీషాపులు సమీపంలో ఉన్న చిన్న దుకాణాల్లో మరీ ఎక్కువగా ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తున్నారు. దీంతో మద్యం బాబులు మద్యం సేవించి వాటిని రోడ్లపైనే పడేస్తున్నారు. దీంతో సమీపంలో గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ గ్లాసులు పేరుకుపోతున్నాయి. అందరూ చూస్తుండగానే వాటిని విక్రయిస్తున్నారు. కానీ అధికారులు పట్టించుకోవడంలేదు.

క్రికెట్ టోర్నీ విజేత మర్రిపాక జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

జగ్గంపేట: గ్రామంలో 10 రోజల పాటు నిర్వహించిన సీరపు రాజశేఖర్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మర్రిపాక టీమ్ నిలిచింది. జిల్లా పరిషత్ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. జీవీఆర్ గ్రూప్ అధినేత జీను మణిబాబు విజేత జట్టుకు మొదటి బహుమతిగా రూ.22,222, దాత దేవరపల్లి మూర్తి రన్నర్స్‌గా నిలిచిన జగ్గంపేట జట్టుకు రూ.15,555 అందజేశారు. మూడు, నాలుగు స్థానాల్లో గెలుపొందిన వారికి వెలిశెట్టి బుజ్జి, సీరపు బాలాజీరెడ్డి రూ.5,555, రూ.3,333 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహం నిర్మించాలి

గండేపల్లి: మండలంలోని రామేశంపేటలో ప్రభుత్వ వసతి గృహం ఏర్పాటు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం పీడీఎస్‌యు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ చదువు కుంటున్నారని, వీరి సౌకర్యార్థం వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు.